క్లుప్తంగా

భయం వీడాలి



పరీక్ష పేపర్లను ఆవిష్కరిస్తున్న శ్యామ్, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులందరూ భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు డి. శ్యామ్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి నమూనా పరీక్షలకు సంబంధించిన పరీక్ష పేపర్లను స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీధర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సునీల్, ఎన్. నాగభూషణం, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎ. సుమన్, పి. గౌరీశంకర్, భాను, తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్‌బంద్



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నెల్లిమర్ల: ఈనెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర్ కార్మిక భవనంలో ప్రజాసంఘాల నాయకులు గ్రామీణ భారత్ బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గ్రామీణ భారత్‌బంద్ చేపడుతున్నట్లు చెప్పారు.

దేవాలయాలను పరిరక్షించుకుందాం

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న హిందూ దేవాలయాలను పరిరక్షించుకుందామని ఉత్తరాంధ్ర ధర్మ ప్రచా ర ప్రముఖ్ పొగిరి సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అయోధ్య అక్షిత అభియాన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండ లాల్లో అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి సత్సంగాలు ఏర్పాటు చేసి, హిందూ ధర్మ ప్రచారం చేయాలని సూచించారు. మతమార్పిడిలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, దేవాలయాల పరిరక్షణ తదితర కార్యక్రమాలను కమిటీలు చూసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ధర్మ ప్రచార సంఘం ప్రతినిధులు లోకనాథం, ఆనందరావు, ప్రేమ్‌కుమా ర్, శంకరరావు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: క్రీడల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. 'ఆడుదాం- ఆంధ్రా' రాష్ట్రస్థాయి పురుషుల వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టుకు మండలంలోని రామవరంలోని తన నివాసంలో జైహింద్ కుమార్ ఆదివారం స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం- ఆంధ్రా' క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధిరామునాయుడు, మండల జేసీఎస్ కన్వినర్ రామసూర్యం పాల్గొన్నారు.

ఘంటశాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గాన గంధర్వుడు ఘంటశాల వెంకటేశ్వరావు వర్ధంతిని గరివిడిలో ఆదివారం నిర్వహించారు. గరివిడి సహాయ్‌పార్క్ వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.గాయకులు శ్రీరామరాజు మాస్టారు, ఈ.వెంకటరామయ్యను సన్మానించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఘంటసాల వర్ధంతి నేపథ్యంలో ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు గరివిడి సీతారామ కల్యాణమండపంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించనున్నామని తెలిపారు. సహాయ్‌సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, గాయకుడు బలగ అప్పారావు, ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, డీసీసీబీ డైరెక్టర్ సివుకు కాంతారావు పాల్గొన్నారు.

వేదిక ఏదైనా మనోళ్లదే పైచేయి..

- వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న కొండవెలగాడ క్రీడాకారులు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్న ఆణిముత్యాలు



కేరళలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన లావణ్య



అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో స్వర్ణం సాధించిన దినేష్



జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించిన విసినిగిరి రాము



సాధించిన వెండి పతకాలను చూపిస్తున్న శనపతి పల్లవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడకు పుట్టినిల్లుగా పేరొందిన కొండవెలగాడలో పదుల సంఖ్యలో క్రీడాకారులున్నారు. ఒకరిని చూసి మరొకరు ప్రేరణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్లు వల్లూరి శ్రీనివాసరావు, మత్స సంతోషి తొలుత క్రీడలో ప్రావీణ్యం పొంది ప్రస్తుతం కేంద్ర కొలువుల్లో స్థిరపడ్డారు. వారిని ఆదర్శంగా తీసుకున్న కొంతమంది యువత నిత్యం కఠోర సాధన చేస్తూ లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, రజత పతకాలు సాధించి జిల్లా పేరును దశ దిశలా మార్మోగించారు. వీరంతా నిరుపేద కుటుంబానికి చెందిన వారే కావడం గమనార్హం. ఏదో సాధించాలనే తపన, తల్లిదండ్రుల ప్రోత్సాహం వెరసి బరువులెత్తడంలో తమకు ఎవరూ సాటిలేరని నిరూపిస్తూ వస్తున్నారు.

ఇటీవల జరిగిన పోటీల్లో సత్తా చాటిన ఆణిముత్యాలు

- కేరళ రాష్ట్రంలోని తిరుచూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో లావణ్య రెండు బంగారు పతకాలతో పాటు ఒక వెండి పతకాన్ని సాధించింది.
- అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో గత నెలలో జరిగిన ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బి. రాజేశ్వరి కాంస్యం, దినేష్ స్వర్ణం, బెల్లాన భార్గవి వెండి, వల్లూరి సుష్మిత స్వర్ణం, శనపతి పల్లవి కాంస్యం, విసినిగిరి రాము కాంస్యం, జనపాటి దేవీశ్రీ వెండి పతకాలను సాధించారు.
- తమిళనాడులో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విసినిగిరి రాము స్వర్ణం, బెల్లాన హారిక రజత పతకాలను సాధించారు.
- హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో రెండు రోజుల కిందట జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ జోన్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శనపతి పల్లవి స్వర్ణం, చుక్కా శ్రీలక్ష్మి వెండి, బి. రాజేశ్వరి కాంస్య పతకాలను సాధించి జయకేతనం ఎగురవేశారు. వేదిక ఏదైనా తమ సత్తా చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కఠోరశ్రమతోనే సాధ్యం

వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించాలంటే కఠోర శ్రమ అవసరం. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించాలంటే సామాన్య విషయం కాదు. ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి పతకాలు సాధిస్తున్నాం. శిక్షకుల సూచనలు, సలహాలు పాటించి నిత్యం శిక్షణ తీసుకుంటున్నాం. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి దేశానికి, సొంత ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం.



– శనపతి పల్లవి, వెయిట్ లిఫ్టర్, కొండవెలగాడ గ్రామం

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. అనంతరం ఎంపీపీ వాసుదేవరావు మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బిల్లుల చెల్లింపులపై కూడా దృష్టి సారించాలని కోరారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ ఎ.లవరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న ప్రసాద్, తదితరులు

విజయనగరం: నగరంలోని నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయానికి మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేల విలువ చేసే కాంపిటేటివ్ పుస్తకాలను ఆదివారం అందజేశారు. సంఘ వ్యవస్థాపకుడు త్యాడ ప్రసాద్ గ్రంథాలయ వ్యవస్థాపకుడు పి.షణ్ముఖరావుకు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయానికి ప్రసాద్ పట్నాయక్ పుస్తకాలు వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు, నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం కార్యదర్శి ఈఎస్‌ఎన్ రాజు, మదర్ థెరీసా సేవా సంఘ సభ్యులు ఝాన్సీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగాఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో 322 మందికి వైద్యులు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారని శిబిరం ఆర్గనైజర్ కండిపల్లి రమేష్ తెలిపారు. వైద్యులు టి.వి.రమణనాయక్, మనోజ్‌కుమార్, జ్యోత్స్న, శశిప్రీతమ్, దీపక్‌చంద్ర తదితరులు సేవలందించారు.

వేడుకగా వాసవీమాత అవతరణ దినోత్సవం



పూజలందుకుంటున్న కన్యకాపరమేశ్వరి అమ్మవారు

విజయనగరం టౌన్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ (అవతరణ) దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మాఘశుద్ధ విదియ సందర్భంగా కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనం, 102 నారీకేళాలతో జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వజ్రకిరీట స్వర్ణకవచ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం మేడపైన రవ్వా శ్రీనివాసరావు నిర్మించిన అన్నదాన భవనాన్ని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్యకపరమేశ్వరి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలన్నారు. దేవాలయ ప్రతినిధులు నారాణం శ్రీనివాసరావు, రవ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాసవీమాత ఆత్మార్పణ చేసుకున్న తర్వాత అమ్మవారిగా అవతరించారని తెలిపారు. దాదాపు 130 ఏళ్ల కిందట నగరంలో కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని నిర్మించామన్నారు. నాటి నుంచి నేటివరకూ అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కుమ్మరిగుంట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే మా అభిమతం



ఐదో డివిజన్‌లో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో నగరం అభివృద్ధి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 4,5 డివిజన్‌లలో నూతనంగా నిర్మించిన రోడ్లు ప్రారంభం



నాలుగో డివిజన్‌లో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ప్రజా ప్రతినిధులు

విజయనగరం: అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ అభిమతమని, ఇందులో భాగంగా గడిచిన నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలు గమనించాలని కోరారు. నగరంలోని 4,5 డివిజన్‌లలో రూ.69 లక్షలతో నూతనంగా నిర్మించిన రోడ్లను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, గాదం మురళీలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గదుల సత్యలత, వీర్రాజు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 5వ డివిజన్ బాబామెట్ట ప్రాంతంలో 4 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. మరోసారి ఆయన్ను శాసనసభ్యుడిగా గెలిపించినట్లయితే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించారని తెలిపారు. ఆదివారం ఒక్క రోజే 69 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేఏపీ రాజు పాల్గొన్నారు.

రవాణారంగ సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: రవాణారంగ సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ. జగన్‌మోహనరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రాములు డిమాండ్ చేశారు. సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 13వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు కేఎల్ పురంలోని ఎన్‌పీఆర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యాలు, డ్రైవర్లు, వర్కర్ల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుపోతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో టోల్ చార్జీలు, అపరాధరుసుంలు విధించి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి రవాణారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తెలగ కులస్తులను బీసీలో చేర్చాలి

- తెలగ సంక్షేమ సంఘ నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు
- పాదయాత్రకు ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు



పీవీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, తెలగా సామాజికవర్గ నాయకులు

పూసపాటిరేగ: తెలగ సామాజికవర్గాన్ని బీసీలో చేర్చాలని తెలగ సంక్షేమ సంఘ నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు అన్నారు. జనవరి 28న ఇచ్ఛాపురం వద్ద ప్రారంభించిన పాదయాత్ర జిల్లాలోని కందివలసగెడ్డ వద్దకు ఆదివారం ఉదయం చేరింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన తెలగ సంఘ నాయకులు పీవీఆర్‌కు సంఘీబావం తెలిపారు. ముందుగా ప్రజాప్రతినిధులు పతివాడ అప్పలనాయుడు, మహంతి జనార్దనరావు, మహంతి శ్రీనివాసరావు, అల్లాడ రమేష్, ఎస్‌ఎస్‌ఎన్ రాజు, కర్రోతు బంగార్రాజు, కంది చంద్రశేఖర్,మ తదితరులు పీవీఆర్‌ను అభినందించారు. అల్లాడపాలెం, జీఆర్‌పాలెం, పూసపాటిరేగ జంక్షన్‌లలో వందలాది మంది తెలగ కులస్తులు పాదయాత్రకు సంఘీబావం తెలుపుతూ స్వాగతం పలికారు. కోళాటం, పులివేషాలతో దారి పొడవునా సందడి చేశారు. ఈ సందర్భంగా పల్లంట్ల వెంకట రామారావు మాట్లాడుతూ.. తెలగా కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. ఉత్తరాంధ్రలో సుమారు 12 లక్షల మంది తెలగా కులస్తులున్నారని చెప్పారు. 1962 సంవత్సరానికి ముందు బీసీ రిజర్వేషన్ ఉండగా.. అనంతరం సంస్కరణల పేరిట తొలగించారని చెప్పారు. రాబోయే ఎన్నికలలో రాజకీయ పార్టీలు తెలగా కులస్తులను బీసీలో చేర్చుతామని మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలగా సంక్షేమ సంఘ నాయకులు అల్లాడ శ్రీనివాసరావు, పసుపులేటి గోపి, బొల్లు రమేష్, దాడిశెట్టి త్రినాథరావు, పి. లక్ష్మీనారాయణ, పెట్టిపు శ్రీనివాసరావు, బాలా అప్పలరాజు, మొంగం శ్రీనివాసురావు, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో సమూల మార్పులు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన

పరిపాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారని, రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నా రు. గత టీడీపీ పాలనలో పథకాల కోసం ప్రజలు జన్మభూమి కమిటీలకు, టీడీపీ నాయకులకు లంచం ఇచ్చుకోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. నేడు సీఎం జగన్ నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వసేవలు పారదర్శకంగా ఇంటి వద్దకే అందుతున్నాయని, పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నామని, ఏ ఒక్కరి నుంచి ఎవరూ రూపాయి లంచం వసూలు చేసిన సందర్భం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు ఎంతో గౌరవం, స్వేచ్ఛ లభించాయని అన్నారు. వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకా లకు సంబంధించిన డబ్బులను నేరుగా అక్కచెల్లమ్మల ఖాతాలకే జమ చేస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

మహిళలకు ఆర్థిక ఆసరా

- సీఎం జగన్ మహిళా పక్షపాతి
- మహిళల ఆర్థికాభివృద్ధే ఆయన లక్ష్యం
- ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాం
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన



లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరయ్య, ఎంపీ చంద్రశేఖర్



సంబరాలకు హాజరైన మహిళలు

దత్తిరాజేరు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. కోమటిపల్లిలో ఆదివారం నిర్వహించిన మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల కు వారు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారన్నారు. డ్వాక్రా సంఘా ల సభ్యులకు 2019 ఏప్రిల్ నాటికి బ్యాంకుల్లో ఉన్న అప్పును నాలుగు విడతల్లో చెల్లిస్తామని ప్రతిపక్షనేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. డ్వాక్రా సంఘాల రుణమాఫీకి సంబంధించి ఇప్పటికే మూడు విడతల్లో మహిళల ఖాతాల్లో డబ్బులు జమచేశా మని, ప్రస్తుతం నాలుగో విడత జమచేశామని చెప్పారు. మండలంలోని 975 సంఘాల్లోని 1,1379 మంది సభ్యులకు నాలుగు విడతల్లో రూ.22.24 కోట్లు అందజేశా మని వివరించారు. డ్వాక్రా సంఘాలకు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారని, ఒక్కరూపాయి కూడా మాఫీ చేయకుండా నాటి టీడీపీ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని గుర్తు చేశారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి అని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అధికశాతం మహిళలకే వర్తించేలా పెద్దపీట వేశారన్నారు. పార్టీలకతీ తంగా పేదలందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మహిళలు, పేదలే వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపెయినర్లగా పని చేయాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీ పీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని సూచించారు. ఏఎంసీ చైర్మన్ ముత్యాలనా యుడు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంపీడీఓ చంద్రకుమారి, వెలుగు ఏపీఎం అచ్యుతరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనా యుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కష్ణమూర్తి పాల్గొన్నారు.

నా కూతురికి ఉద్యోగం వచ్చింది



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే గ్రామసచివాలయ వ్యవస్థను నెలకొల్పి లక్షలమంది ఉద్యోగాలు ఇచ్చారు. నాకుమార్తెకు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చిం ది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా డ్వాక్రా సంఘంలోని సభ్యులకు రూ.4.30 లక్షలు అందాయి. నాకు చేయూ త పథకం సహాయం అందింది. నా మనుమరాలికి అమ్మఒడి డబ్బులు వస్తున్నాయి. రైతు భరోసా సహాయం అందింది. స్త్రీనిధి ద్వారా ఇచ్చిన రూ.50 వేలరుణం, పథకాల ద్వారా అందిన ఆర్థిక సహాయంతో చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నాను. మా ఆర్థికాభివృద్ధికి ఆసరాగా నిలుస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– రౌతు తౌదమ్మ, పెదమానాపురం